

*సౌకర్యంగా నడవడానికి సమాజానికి అతను సాయం చేస్తాడు.
మరి తను ఎంత సౌకర్యవంతంగా జీవిస్తున్నాడా అని అతనిని,
అతని చుట్టూ వున్న మరికొందరిని చూసి విస్తుపోయి,
నా విస్మయాన్ని కథగా వ్యక్తీకరించాను.*

ఎం.ఎస్.కె. కృష్ణజ్యోతి

# 9

# నేను తోలుమల్లయ్య కొడుకుని





ఆదివోరం పెద్దకూర పండగా, నాటుసారా ఏడుకా గడిసిపోయ్యాక సోమారం చెప్పుల దుకానం కాడ కూచోడం బలే కష్టమనిపిచ్చుద్ది మారయ్యకి. కానీ తప్పదు గదా. మళ్లా వారవంతా అందరి కడుపు నిండి, వారం శివర కాసింత సర్దా కావాలంటే ఈడ కూచుని ఎదురు చూడాలిసిందే. దుకానవంటే ఏవంత కాదుగానీ, నేలమీద రెండు గోనెలు, సుత్తీ, అరా, పెద్దసూదీ, దారం, అతికిచ్చే బంక, ఇంకా నాలుగు జతల పాత చెప్పులు! ఓ చిన్న టార్పలిన్ షెడ్డు. అదీ వానా కాలం గాబట్టి ఓ మనిషి పట్టేంత చోట్లో ఎదురుకర్రలతో షెడ్డు ఏశాడు. చలికాలం ఆకాశం కిందనే. ఎండకి మాత్రం ఓ గొడుగేసుకుని నల్లని గొడుగు కింద మండతా వుంటాడు. అలవాటైపొయ్యింది.

నలభైయేళ్లుగా ఈడ్నే కూసుని వుండాడు. రామారావు ముక్య మంత్రి కాకముందర, అయిన తరవాత ఊరికొచ్చినపుడు యీ దారంటే ఊరేగింపు చేసిండు. ఆ ఎనక చంద్రబాబు. అంత లావు రామారావుని జనం బుర్రలోంచి మరిపిచ్చేసిన ఈ మారాజేవరా అని చంద్రబాబుని ఎగిరెగిరి చూసి విస్తుబోయ్యాడు. అయితే రాజన్న మటుకు తక్కువా?! పంచెగట్టి చేతులూపుకుంటా పోతావుంటే జనాలు ఎంత ఇదైపొయ్యారు. చూస్తానే వుండాడు... అందర్నీ... యీడ్నే కూచుని. ముందుకీ పక్కకీ జరగలాగాని రోడ్డు ఎడల్పు చేసేప్పుడు కాసింత ఎనక్కి పోవలిసొచ్చింది!

బేరాలు లేవు. సినిమా హాలు సెంటరు కాడ రాత్రి చానా పొద్దు దాకా జనాలు తిరుగతనే వుంటారు. అయినా సరే ఈమధ్య బేరాలు లేవు. పెళ్లిగాక ముందు పగలనే ఏముంది తను రేత్తిరిపూట సినిమా యిడిసి పెట్టేదాకా ఆడనే కాసుకుని ఉండేవోడు. రేత్తిరి సినిమాకి వచ్చే జనం పొయ్యే జనంలో ఇద్దరి ముగ్గురి చెప్పులన్నా తెగిపోయ్యేయి. ఆ టయాన జోడు తెగితే మంచి గిరాకి. ఏళగాని ఏళ గాబట్టి తనకి ఓ రూపాయి ఎక్కువ వసూలు! ఆ వసూలైన డబ్బులు దాపెట్టి ఆదోరం జలసా చేసేవోడు. పెళ్లైన తరవాత పొద్దుగుంకక ముందరే ఇంటికి పోవలిసొచ్చింది. సందకాడ ఉజ్జోగం మానేశాడు.

ఆరోజుల్లో ఇప్పట్లా పతోల్లు జోళ్లు ఏసేవాళ్లు గాదు. యియ్యాల జూస్తే, ఒక్కో మడిసికి నాలుగేసి రకాలాయే. పొద్దున్న లేస్తే ఆమనే నడుసుకుంటా పొయ్యేదానికి ఒగటి, ఇంట్లో ఒగటి,

ఆఫీసుకోటి, ఆటలకోటి, బజారుకి పొయ్యేదానికి ఇంకొగటి! తిండికి లేనోడు కూడు సంపాయించుకోను యాడస్తుంటే జరిగినోడికి ఇట్టి...!

యీడ కూచుని చూస్తనే వుండాడు, జనాలు సినిమాలకి నడస్తా రావడం మానేశారు. తొక్కుడు రిక్షాలు పోయి ఆటోలు, సైకిళ్లు పోయి మోటారుబళ్లు, రకరకాల గుడ్డలు, ఇంకా... గుడ్డ రంగునిబట్టి జోళ్లు! జోళ్లు నలక్కముందే పడేత్తన్నారు. ఇంకా తెగేది ఏడ? తనకి పని దొరికేదేడ? పక్క సందులో సాయిబాబా గుడికాడ రకరకాల కొత్తజోళ్లు వొర్సగా ఉంటాయి. ఆటిల్లో నాలుగు తెగబెరికేసి ఆడనే దుకానవెట్టి మళ్లా కుట్టేస్తే బావున్ను! కానీ తనకట్టా చెయ్యను సేతగాదు. ఇప్పుడేగాదు, ఎప్పుడూ తప్పుడు పనులు జేసి డబ్బులు సంపాయించాలని చూల్లేదు. బిడ్డల చిన్నతనంలో ఇంటికాడ మంది తక్కువ, పనెక్కువ. ఇప్పుడు మంది పెరిగారుగాని పని రాన్రాను తగ్గిపోయింది. తనకొచ్చే సొమ్ముతో ఇల్లు గడవక, పెళ్లాం పాలేనికి దగ్గర్లో టీచరమ్మకాడ పనికిజేరింది. మరి దానికి బైట రోజుకూలి పనికి పొయ్యే ఓపిక లేదు, అలవాటు లేదు.

దుకానం సర్దతానే తలెత్తి చూశాడు. ప్రతిరోజూ చూస్తాడు. ఎదురుగా కిళ్లీ షాపులో షబానా వుంటది. పెళ్లి కాకండానే ముసిల్ది అయిపొయ్యింది. ముసుగుల్లో వుండాలిసిన పిల్ల బజార్లో కూచుని వుంటానో, తల్లీ తండ్రికి తాహతు లేకనో ఆ పిల్లకి నికా కాలేదు. షాపుకి మొగోళ్లు సిగ్రెట్లకని, వక్కపొడికననీ ఒక్కోసారి కాలక్షేపానికని వస్తనే వుంటారు. షబానా ఎవ్వరివొంకా తలెత్తి చూడదు. అందరితోను కోపంగా వున్నట్టు మాట్టాడుతాది. కానీ తనవంక మాత్తరం అదో ఇదిగా చూసేది. తన మొహాన్నీ, బుజాలని మొత్తం కండల్ని కళ్లతో తడిమేది.

ఎప్పుడైనా ఒళ్లు తేడాజేసి రెండ్రోజులు షాపు తెరవకపోయినా ఆలిసంగా తీసినా కంగారుగా కళ్లతో పలకరించేది. తను తలెత్తి చూడకుండానే షబానా తన్ని చూస్తుందని కనిబెట్టగలడు. తనక్కూడా షబానా మీద మోజుండేది.

ఓ కాలంనాడు దయిర్నం చేసి మాట్టాడి లేవదీసుకుపోవల్నుకున్నాడు. కానీ ఇద్దరూ మంచం పొత్తు లేని జాతులై పోయే. పైగా అంగడి ఏవైపోద్దో అని గాబరా పడ్డాడు. ఈరోజున పెళ్లి పెటాకులు లేకండా దిగాలుగా వాడిపోయిన షబానాని చూత్తే జాతిని తీసుకెళ్లి నూతిలో పారేసి, నా 'సూపరు మారికెట్టు' ఎత్తి ఏ సందులో పరిస్తే పని జరక్కుండా పోయేదా, దీనికోసరం ఆ పిల్లని ఉసురు పెట్టానా అని మనేద కలుగుద్ది. మేనమావ కూతురు రవనని మనువాడినా చానా మాట్లు రేత్తిరిల్లు తన పక్కన ఒత్తిగిల్లిన పిల్ల రవనలా కాకండా షబానాలా కనబడేది!

అల్లంత దూరాన జగ్గయ్యపంతులొస్తా కనబడ్డాడు. ఇద్దరూ ఒకే కాలాన్ని పుట్టినోళ్లు. ఇంటికాడ చొక్కా ఏసుకోడు, బజారోస్తే నీలం గళ్ల చొక్కా ఏస్తాడు. మడిసి పచ్చంగా తన నల్లటి సేతులతో తాకితే మాసిపోతాడేవో అనేలా వుంటాడు. కానీ తనంత గట్టింగ లేడు. మెడ కాడా, చెంపలకాడా జారిపొయ్యింది. పంతులు తనూ ఒకే బళ్లో పలకబట్టారు. తన సదువు నాలుగుతో ముగిసిపోతే పంతులు చానా దూరం పొయ్యాడు. పోతం పొయ్యాడుగాని ఎప్పుడూ అత్తెసరే. ఆడాడ లెక్కలు రాసి బతక

తంటాడు. వున్నా లేకపోయినా గుడ్డ నలగనీడు. మడిసి చానా ఉషారు. ఐతే చాదస్తం బాపడు. లేపోతే ఊళ్లో ఎన్ని యాపారాలొచ్చాయి! కానీ తన దగ్గర్నే చెప్పు తయారు చేబిచ్చుకుంటాడు. ఎంత అడిగినా బేరం ఆడకుండా ఇచ్చేస్తాడు. తనుగూడ ఎప్పుడూ పంతులి నుండి ఎక్కువ గుంజాలని చూళ్లేదు.

"ఆ, మారయ్యా మన బాటా కంపెనీ కొత్త మోడల్స్ తియ్యి. జోళ్లు మార్చేద్దాం," జగ్గయ్య తన పరచికానికి తనే ఇరగబడి నవ్వుతా పక్కనే బల్లమీద కూలబడ్డాడు.

"రా పంతులా, నీకోసరం గాక ఎవురికోసరం ఈడ కూసుండి వున్నా?! అట్నే కుట్టేద్దాం... రేపొద్దుటికి." తన పాత సావాసగాడినీ, కస్టమర్నీ చూసి మారయ్య మనసు కుశాలైపోయింది. మరి ఇద్దరి స్నేహం ఇయ్యాల్టిది కాదు.

తోలుపని చేయడం గమ్మత్తనిపించినపుడు, బడి మానేసి పన్లోజేరాలనుండే సంగతి ఇంటికాడ కాకండా జగ్గయ్యతోనే చెప్పిండు. జగ్గయ్య కాసేపు బడి మానోద్దని మారయ్యని బతిమీలాడాడు. గోటింబిల్లా, గోలికాయలు, బచ్చాలు, ఇంకా అట్టాంటి చానా ఆటలు మారయ్య కాడనే జగ్గయ్య రహస్యంగా నేరిచాడు. అట్టాంటి గురువు తన్ని వొదిలి పోతాడంటే జగ్గయ్యకి దిగులైపోయింది. కానీ మారయ్య ఇనిపిచ్చుకోల.

"రేపటినించీ రానంటే రానంతే," ఆఖరికి ఇసయం అదే.

ఆరోజున ఇద్దరూ ఆశ తీరా ఆడుకున్నారు. మాపటేళకి ఇంటిదారి బోతన్నారు. జగ్గయ్య ఇల్లు బజారు ఏమ్మిడే. మారయ్య గుడిసె మటుకూ బజారు దాటి సివరాకర్న ఆడేడో. ఆటకి అలిసి సావాసగాళ్లకి దప్పికైపోయింది.

"దాహంగా వుందిరా," మారయ్యకి గస లేసింది.

జగ్గయ్య చప్పున ఇంట్లోకి పోయి లోటానిండా నీళ్లు తెచ్చాడు. మారయ్య గటగటా తాగేశాడు. అంతట్లోకి యాదిలోంచి పెద్ద పంతులు (జగ్గడి నాన్న) గుమ్మంలో కొచ్చాడు. మారయ్య సాయ ఎగాదిగా చూశాడు.

"ఎవరబ్బాయివిరా?" అనుమానం!

"నేను తోలు మల్లయ్య కొడుకుని." పాలెంలో అయ్యని అందరూ అట్నే పిలుస్తారు. అట్టా పిలవడం మారయ్యకి శానా గొప్పగా అనిపిచ్చుద్ది.

"దాహానికి నీళ్లు తాగితే తాగావుగానీ, ఆ చెంబు ఇహ ఇంటికి పట్టుకుపో. మళ్లా మా అబ్బాయితో తిరగవాక," జగ్గన్ని బుజం పట్టుకుని ఈడ్చుకుపోతా చెప్పాడు.

మారయ్యకి చెంబు బలే నచ్చింది. ఉత్తికినే వచ్చింది పైగా. ఇంట్లో వున్న సత్తు సొట్టల చెంబు మాదిరిగా గాకండా ఇది తళతళగా వుంటం మూలాన మొగం గూడ సూస్కోవచ్చు.

"యాడిదిరో చెంబు," పుల్లమ్మ కొడుకునీ చెంబుని వింతగా మార్చి మార్చి చూస్తా అడిగింది.

"జగ్గయ్య వాళ్ల నాన్న, పెద్దపంతులుండాడే ఆయనిచ్చాడు. ఆడ నీళ్లు తాగినా. ఎమ్మటే సెంబిచ్చేశారు," గర్వంగా గడ్డమెత్తి చెప్పాడు.

“నిన్ను తిట్టి కొట్నారా?” అమ్మకి  గాబరా పుట్టింది.

“లేదే! ఎందుకూ?” అమ్మ, పిల్లాడు ఆళ్లకి తెలీకండా చెంబు తెచ్చిందను కునిందో ఏందో.

“ఏరే వాళ్లైతే సంపినంత పని జేద్దురు. పెద్దపంతులు దేవుడే. బిడ్డో, నీళ్ల కోసరం అట్టా పెద్దోళ్ల కొంపలమీద పడమాక. కడగొట్టోళ్లం. ఆళ్లని కళ్లతో జూసిందే మనకి గొప్ప. అంతగా దప్పికైతే దోసిట్లో పోబిచ్చుకుని తాగు,” అమ్మ జాగర్త చెప్పింది.

ఈరోజుకీ మారయ్య ఆ చెంబుతోనే నీళ్లు తాగుతాడు. ఆ చెంబు తన పుట్టుకని ఎగతాళి చేసేదని చానాకాలానికిగాని బుర్రకెక్కలేదు. పని తగ్గి కాళీ పెరుగుతున్న రోజుల్లో, పక్కనే వున్న ఇంకో పాలెంలోకి సున్నం పనికిబొయ్యాడు. దండెం మీద తువ్వాలుకి కడిగిన చేతులు తుడిస్తే ఆ ఇంటి ఆడది నారాయణమ్మ తువ్వాలు ఎత్తకపొమ్మంది! అమ్మ జెప్పిన సంగతి గ్యాపకం వొచ్చింది. తను కడగొట్టు మడుసుల్లో కడగొట్టు. చెర్చి కాడ కంచం పొత్తు సూబెట్టెవోళ్లు ఇంటికాడ తేడా సూబెట్టేశారు.

బడి మానేసి తోలుపనికి జేరేప్పటికి తను చిన్నోడే. మొదట్లో ఆ వాసనకి వాంతి చేసుకుండాడు. కొన్నాళ్లకి అలవాటయ్యింది. కానీ పని ఎన్నాళ్లో సాగలా.

“తోలుపని ఇడిసి పెట్టేసేయ్‌రా. ఇది ఒంటిని లోపట్నించి తినేస్తాది. పేనం వున్నప్పుడు మెరిసే తోళ్లు పేనం పోయినాక కరిసేస్తాయి. నా రోగం తోలు నుంచే పుట్టింది.” సచ్చేముందు అయ్య మాట ఇన్న తరవాత తోలంటే బెదురుబుట్టింది. దాన్ని ఇడిసి పెట్టేశాడు. సినిమా హాలు కాడ దుకానవెట్టాడు. జోళ్లు బాగుజేసేది, తయారుజేసేది నేరిచాడు. కొత్తగా పని జేసేప్పుడు పనిలో ఒళ్లు దగ్గిరిండాల! లేపోతే సేతులు సిల్లులే. కానీ మారయ్య మటుకూ సులువుగానే వైనం పట్టేశాడు.

“పిల్లకాయలెట్టున్నారు పంతులా?” మారయ్య ఆరా తీశాడు.

జగ్గయ్య మొహంలో కులాసా మాయమై దిగులొచ్చింది.

“ఆ ఏముంది మారయ్యా. పూజలు చేసేదానికి పనికిరాని పంతుళ్లు. ఉజ్జో గాలు సంపాయించలేని మొద్దోళ్లు. పెద్దోడు హైదరాబాద్ పోయాడు. చిన్నోడు ఇంకా ఏ పని చెయ్యాలో తెలవక తిరగతా వున్నాడు.”

“కానీ పంతులా. ఏదో ఒక పనికి పోనీ,” తలొంచుకుని చేతినున్న చెప్పుకేసి చూస్తా నిట్టూర్చాడు మారయ్య.

“మాబోటోళ్లని మీవోళ్లు నేలకి తొక్కేసిన పాపం మీరిట్టా అనుబగిస్తన్నరేవో పంతులా,” మళ్లా తలెత్తి పరాచికంగా నవ్వతా అనేశాడు. జగ్గయ్య కూడా నోరారా నవ్వాడు.

“ఓ కాలంనాడు మేం గొడ్లు కాసుకుంటా, గొడ్డుమాంసం తింటా బతికా మంట. తరవాత రాజుల్నీ, రాజ్యాల్నీ ఏలాం. ఈరోజు నువ్వు తోలు కోసుకుంటా, గొడ్డుమాంసం తింటా బతకతన్నావు. రేపు నువ్వు రాజ్యం ఏలతావులే.” పంతులు భరోసా ఇచ్చిండు.

“నే రాజ్జానికి వొచ్చేలోగా ఇల్లు గడవాలిగా. మనవడికి వొళ్లు ఎచ్చుబడింది. మందు ఏపిచ్చాలి. రెండొందలిప్పియి పంతులా,” మారయ్యకి అవసరం గురుతు కొచ్చింది. పంతులు జాగర్తగా రెండు నోట్లు తీసి మారయ్య చేతిలో పెట్టాడు. మారయ్య ఆటిని బొడ్లో దోపాడు.

“ఇంతకీ రాజ్యం చేతికొచ్చాక ఏంజేస్తావు మారయ్యా?” జగ్గయ్య నవ్వతానే అడిగాడు.

“నాకైతే అట్టాటి పెద్ద ఆలోశన లేదు. రాజ్జాలు ఏలేది ఒకరో ఇద్దరో. తీరా కురిచీలు ఎక్కాక మడుసుల్లో మారుపొచ్చేసుద్ది. నాకు దరమం కావాల. నా పనిగూడా అన్ని పనుల్లోకి సమానం కావాల. అంటే సూది మందేసే బాబుతో సమానంగా నాకూ డబ్బు ఇయ్యాల. నాకే గాదు... అన్ని పనులకీ అటుఇటుగా ఒకే రేటు వుండాల. ఇగ అన్ని కులాలోల్లకి పని దొరకాల! అప్పుడు ఎక్కువా తక్కువా తేడా ఏడుంటది?”

“ఓర్నీ అసాధ్యం గూలా! నువ్వూ సూదిమందిచ్చే డాక్టరూ ఒకటే?” పంతులు నమ్మలేనట్టు మొకం పెట్టి నవ్వాడు.

మారయ్య పొగాకు నములా్త వున్నాడు. జవాబు చెప్పేదానికి తుపుక్కున ఉమ్మేశాడు. ఇంతట్లోకి గందరగోళంగా గోస ఇనపడింది. మందిజేరి ర్యాలి తీశారు. మారయ్య పెద్దకొడుకు కొండయ్య ముందర్నే నడస్తావుండాడు. ఆడు మందిలో లేపోతే అనుకొవాల. ఉండకుండా ఎట్టా? మరి తన కొడుకు నాయకుడుగదా! కొండయ్యకి అన్ని కులాల్లో సావాసగాళ్లున్నారు. ఎవురూ ఆడికి నీళ్లు తాగిన చెంబిచ్చేసేదానికి, దోసిట్లో నీళ్లు పోసేదానికి దయిర్నం చెయ్యరు. ఆడు పులిలాటోడు. ఆడికన్ని తెలుసు. కానీ ఇంకా సంపాదన్లోకి రాలేకపోతన్నాడు.

కొండయ్య ర్యాలి వదిలి నాన్న కాడికొచ్చాడు.

“నువ్వు గూడా రాగూడదా నానా?”

“నువ్వు పోరా నాకు దుకానవుంది.”

“ఎప్పుడూ వుండే దుకానమేగా. ఆడ పారేసి రాగూడదా,” కొడుకు ఆదుర్దా.

“ఎందుకురా ఈ తంతు ఇయ్యాల?”

“ఉజ్జోగాల్లో న్యాయం జరిగేదానికి.”

“ఎన్ని ఉజ్జోగాలున్నయిరా?”

“ఎన్నైనాగానీ, పెద్ద పెద్ద ఉజ్జోగాల్లో మనోళ్లు పోవాలి.”

“నే రాలేను. నువ్వు పోరా.” మారయ్య ఉన్న చోటు నుంచి కదలేదానికి ఇష్టపడలేదు. కొండయ్య కోపంగా సిరాగ్గా చూసి ఎల్లిపోయాడు.

రెండో కొడుకు బుద్ధి పుట్టినపుడు ఆటో ఏస్తాడు. తనకొడుకేంది, తనకి తెలిసిన కమ్మరోల్ల కొడుకులు, కుమ్మరోల్ల కొడుకులు, వొడ్డి పిలకాయలు ఆటోలు తోల్తానే వున్నారు. అంతకి మించి వాళ్లకేం పని అగపడలా.

పంతులు ర్యాలీ చూత్తా గమ్మునున్నాడు. మారయ్య మాట్టాడాడు, “పాత రోజులే నయ్యం పంతలా. జనాలు తక్కవున్నా పని దండిగా దొరికేది. ఇయ్యాల

జనాలెక్కువ. పనులు లేవు. పని వున్నోడికి పనిమీందనే వుంటది. లేనోడికి కోపంగా సిరాగ్గా వుంటది. పెద్దపెద్ద కురిచీలెక్కినోళ్లు ఈ పిల్లోళ్లికి పని సూబిచ్చలేక, ఆళ్లు రోడ్లట్టుకు తిరగతా ఆక్రూసిస్తా వుంటే నిమ్మళంగా వుంటారు. ఈ పిలకాయల్లో చురుకంతా ఎవురికీ పనికిరాకండా పోతంది. దీన్ని వాడుకోను లోకానికి చాతగావడంలేదు.''

పంతులు మళ్లా ఏం మాట్టాడలేదు. ''ఇహ పోతా మారయ్యా,'' అనేసి ఇంటేపుకి పొయ్యాడు.

పంతులు తనని 'అరే ఓరే' అనీ బమగా పిలస్తాడు. కానీ తనట్టా పిలవలేడు. తను సిన్నదో పెద్దదో అని సూడకుండా ఏ పనైనా జేసుకు బతగ్గలడు. కానీ పంతులట్ట బతకలేడు. తమకిద్దరికీ ఒకళ్ల మీంద ఒకళ్లకి అబిమానం వుందిగానీ ఒకళ్లింటికి ఒకళ్లు పోరు. కొండయ్య మటుకూ ఎవురింటికైనా పోగలడు. పెద్ద పెద్ద సంగతులు మాట్టాడగలడు. కానీ అదేందో మరి ఆడుగూడా సంతోషంగా లేడు!

నిట్టూరుస్తా పంతులి పని మొదలెట్టబోయిన మారయ్యకి ఇంటికి పోవలసిన తొందర గెవనంలోకొచ్చింది. కూతురొచ్చింది. ముగ్గురు బిడ్డల తల్లి. అల్లుడు మరీ తట్టుకోలేనంత దెబ్బలుగొడితే వచ్చేసుద్ది. అల్లుడు అదోరకం. ఆడికి ఎప్పుడు తిక్క రేగినా పెళ్లాం లోకువగా దొరుకుద్ది. దాన్ని సావబాత్తాడు. తిక్క రేగడానికి పెద్ద వొంకలు కూడా అవసరంలా. ముద్ద మింగేప్పుడు పొలమారినా సాలు.

అమ్మమ్మ గ్యాపకంగా కూతురికి ఎంకటలచ్చిమని పేరెట్టాడు. పెళ్లి తరవాత అల్లుడు దాన్ని ఎలిజిబెతని మారిచాడు. అంతకుముందు మాతమ్మ గుడికాడ దన్నవెట్టే కూతురు ఇప్పుడు మరియమ్మ గుడికాడ గూడా మొక్కుతాది. అంతే! పేరుమారినా, కొలిచే దేవుళ్లు మారినా ఆ పిల్లకి పట్టదు.

''అన్నీ ఒగటేలే అయ్యా, తిని తీరిగ్గా కూచ్చునే వాడికి తగూలన్ని,'' కాచి వడబోసినట్టు చెప్పేసుద్ది.

ఐతే రవనకిగానీ తనకిగానీ కొత్త పేరు నోరు తిరగలా, గానీ బిడ్డ అలవాటు జేసేసుకుంది. అడదిగదా, మొగోడు చెప్పినదానికి అలవాటు పడాల. కడగొట్టోళ్లలోకి కడగొట్టుది ఆడదే!

అంగడి కట్టేశాడు. అంటే తాళాలు ఎయ్యడం కాదు. ఉన్న సరంజామా మీద గోతం పట్టాలు కప్పి వచ్చేశాడు. ఎవురి సొత్తు అయినా దోచుకోగలరు. కానీ మాదిగోని సొమ్ము దోసుకోరు. అది దరిద్రపు సొమ్మంటారు. ఏవుందాడ? పాత చెప్పుల సంపద! ఇదే లోకం మాదిగోనికిచ్చిన సొత్తు. ఊరికే ఇస్తా అన్నా ఎవురూ తీసుకోరు!

ఇంటికి చేరేప్పటికి బుడ్డోడికి అయ్యావారమ్మ జరంబిళ్ల ఇప్పించిందని జెప్పింది రవన. జరం నిమ్మలిచ్చింది. రెండొందలు మిగులు. పెళ్లామిచ్చిన టీ నీళ్లు తాగి కింద గుడ్డేసుకుని పండుకున్నడు మారయ్య. తలలో ఆలోశన్లు కుమ్మరిపురుగాలే తొలిసేస్తన్నాయి.

పంతులికి కూటికి ఇబ్బందే. చెప్పుకోడు. తనకి రేపటి రోజు ఎలా తెల్లారుద్దో తెలీని పరిస్థితి. కొడుక్కి తెలివి వుందిగానీ ఉజ్జోగం లేదు. షబానాకి ఇంక మొగుడు

దొరకడు. కూతురికి మొగుడు బారి నుండి ఎట్టా బైటపడాలో తెలీదు. ఏదో మంద పాటి గోడ అడ్డంబడతంది... ఈ బతుకులకి ఆటి సుకానికీ మద్దెన గోడలు!

అవును గోడలు!

ఎదురుగా చూశాడు. తన ఇంటి మట్టిగోడ. ఒక్క దెబ్బకి పడిపోద్ది. కళ్లు మూసుకున్నాడు. ఎత్తుగా గోడలేవో కనబడతన్నాయి. చాలా బలంగా వున్నాయి. కల గంటన్నాడా? మేలుకునున్నాడా? మారయ్యకే అర్థంకాలేదు. మళ్లా కళ్లు తెరిచాడు.

కళ్ల ముందు ఏడోకలాసు కంటే ఎక్కువ, ఎనిమిదో తొమ్మిదో సదూతున్న ఎలిజిబెత్ కూతురు.

"అమ్మీ, ఉక్కు పోసి గట్టి మందపాటి గోడ కట్టారనుకో... దాన్నెట్టా బద్దలు కొట్టేదీ?" అడిగాడు.

"కింద బాగా వేడి పెట్టు. కరిగిపోద్ది. అయితే వేడి చానా ఎక్కువ పెట్టాలి తాతో."

కాసేపటికి బయట మబ్బుగమ్మి వాన పడతా వుంది. ఇంటి ఆడది బొగ్గుల కుంపటి రాజేసి పిలకాయల కోసరం మొక్కజొన్న కంకులు కాలస్తంది. కొండయ్య కూడా ఇంటి కాడనే వున్నాడు. అంతా చలికి వనకతా వున్నారు. చేతులు ఎచ్చబెట్టు కోడం కోసరం కుంపటి కాడ జేరి చేతులు జాపారు.

"ఎంతేడి పెడితే గోడ కరుగుద్దో ఇంత సలిలో!" పైకే అనుకుంటా మారయ్య గూడా లేచి వాళ్ల పక్కకి జేరాడు.

సెగ ఎచ్చగా నరాల్లోకి పాకింది.

*సారంగ అంతర్జాల పత్రిక*
*1 అక్టోబర్ 2015*



12 నవంబర్ 1975న పుట్టిన కృష్ణజ్యోతి మొదటి కథ సవారి తెలుగు వెలుగు మాసపత్రికలో ప్రచురింపబడింది. ఇప్పటివరకు 13 కథలు ప్రచురితమయ్యాయి. వృత్తి జీవశాస్త్ర ఉపాధ్యాయిని.

***చిరునామా: 1-10-75/1, అరటి తోట, పాతూరు, కావలి.***
***ఫోన్: 94405 04898***
***mskkrishnajyothi@gmail.com***